ఎన్‌ఎంఎంఎస్ దరఖాస్తు గడువు పెంపు

పాడేరు, న్యూస్‌టుడే: జాతీయ ప్రతిభా ఉపకారవేతన పరీక్షకు (ఎన్‌ఎంఎంఎస్) దరఖాస్తు గడువును అక్టోబరు 5వ తేదీ వరకు పొడిగించారని జిల్లా విద్యాశాఖాధికారి పి.బ్రహ్మాజీరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది ఇప్పటివరకు 559 మంది వరకు విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్నారని డీఈఓ, ఎస్‌ఎస్‌ఏ అసిస్టెంట్ కమిషనర్ శశికుమార్ పేర్కొన్నారు. ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక చొరవ తీసుకుని విద్యార్థులతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయించాలని ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ.50 రుసుం చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు.



వంతెన లేక యాతన

అమ్మవారి ధారకొండ పంచాయతీ గొల్లపల్లి గ్రామానికి వెళ్లే రహదారులు ఇటీవల వర్షాలకు కొట్టుకుపోయాయి. నడింవీధి- గొల్లపల్లి మధ్యనున్న కాలువ ప్రమాదకరంగా ప్రవహిస్తుండటంతో రాకపోకలకు గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో పనిచేస్తున్న ముర్ల సీతమ్మ బుధవారం తలపై కోడిగుడ్లు, ఇతర సరకులు పెట్టుకుని స్థానికుల సాయంతో ప్రమాదకరంగా గెడ్డ దాటింది. అధికారులు స్పందించి నడింవీధి- గొల్లపల్లి మధ్య కాలువపై వంతెన నిర్మించాలని మండల తెలుగు యువత అధ్యక్షుడు ముర్ల కోటేశ్వరరావు డిమాండ్ చేశారు.

–న్యూస్‌టుడే, సీలేరు

చెంతనే జలసిరి.. చేజారుతున్న ఊపిరి

ఈనాడు, పాడేరు, న్యూస్‌టుడే బృందం

▸▸ ఈ ఏడాది మే నెలలో పెదబయలు మండలం జామిగుడ వద్ద తారాజు జలపాతంలో దిగి అరకులోయ మండలానికి చెందిన వేణుగోపాల్ అనే యువకుడు చనిపోయాడు.

▸▸ నాలుగు రోజుల క్రితం మారేడుమిల్లిలోని జలతరంగిణి జలపాతం వద్ద ఒక్కసారిగా నీటి ప్రవాహం పెరగడంతో అయిదు గురు వైద్య విద్యార్థులు గల్లంతయ్యారు. అందులో ఇద్దరు మాత్రమే స్థానికుల సహకారంతో ప్రాణాలతో బయటపడ్డారు. మరో ఇద్దరు చనిపోయారు. ఇంకొకరి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.

▸▸ ఇటీవల అనంతగిరి, దేవరాపల్లి మండలాల మధ్య సరియా జలపాతం వద్ద ఇద్దరు యువకులు స్నానాల కోసం దిగి లోతులోకి చిక్కుకుని తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయారు.

జాగ్రత్తలు మరిస్తే అవే జల సమాధులు

విహార యాత్రలు విషాదం కానివ్వొద్దు..



ఎర్రవరంలోని జలపాతాల వద్ద స్నానాలు చేస్తున్న యువత (పాతచిత్రం)

ఉమ్మడి విశాఖ జిల్లా ప్రకృతి రమణీయతకు పెట్టింది పేరు. నగరం, మైదానం, ఏజెన్సీ ప్రాంతాలతో మిళితమై ఉండడంతో పర్యటకులు ఉమ్మడి జిల్లాను ఎక్కువగా ఇష్టపడుతుంటారు. సముద్ర తీరం, బౌద్ధారామం, ఘాట్‌రోడ్ల ప్రయాణం, ఎత్తైన కొండల నుంచి జాలువారే జలపాతాలు.. పర్యాటకులకు కనువిందు చేస్తుంటాయి. అయితే ఈ ప్రకృతి అందాల వెనుక ప్రమాదాలను పసిగట్టలేకపోతున్నారు. మద్యం మత్తు, సెల్ఫీల మోజు, రాకపోయినా నీళ్లలో ఈదాలన్న సరదాలతో ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. ముఖ్యంగా గగనలవారే జలపాతాల వద్ద జరుగుతున్న ప్రమాదాల్లో ఎక్కువ మంది చనిపోతున్నారు. గత ప్రభుత్వం పర్యాటక ప్రాంతాలను ఆదాయమార్గంగా చూసిందే తప్ప వాటి దగ్గర కనీస రక్షణ చర్యలు చేపట్టకుండా నిర్లక్ష్యం చేసింది. కూటమి సర్కారు ఈ లోపాలను సరిదిద్ది విహార యాత్రలు విషాదం కాకుండా ఉండేలా స్వదేశీ దర్శన్‌లో మౌలిక సదుపాయాలు, భద్రతా ఏర్పాట్లు కల్పించేలా చర్యలు చేపట్టబోతుంది.

అల్లూరి జిల్లాలో కొయ్యూరు మండలంలోని వల్సంపేట (గాదిగొమ్ము) జలపాతం వద్ద ప్రమాదవశాత్తు ఇప్పటివరకు సుమారు 48 మంది చనిపోయారు. అలాగే అనంతగిరి మండలం సరియా జలపాతంలో స్నానాల కోసం దిగి 24 మంది ప్రాణాలు కోల్పోయినట్లు పోలీసులే చెబుతున్నారు. ఇక్కడ 60 అడుగుల లోతు ఉండడంతో తెలియక ఊబిలో చిక్కుకుపోతున్నారు. డుంబ్రిగుడ మండలం జలవిహారి వద్ద గతంలో ఎక్కువ ప్రమాదాలు చోటుచేసుకునేవి. సుమారు 28 మంది వరకు అక్కడ స్నానాలకు దిగి మృత్యుఒడిలోకి చేరుకున్నారు. పర్యాటక సీజన్ వచ్చిందంటే చాలు ఏజెన్సీలో ఎక్కడో ఒకచోట జలపాతాల్లో ప్రమాదాల మాట వినిపిస్తూనే ఉంటున్నాయి. కొన్నిచోట్ల మాత్రమే ఐటీడీఏ, అటవీ శాఖ ఆధ్వర్యంలో కమ్యూనిటీ బేస్డ్ ఎకో టూరిజం పేరుతో కొన్ని సదుపాయాలు కల్పించారు. చాలా జలపాతాల దగ్గర హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేయలేకపోయారు.



సరియా జలపాతంలో ప్రమాదభరిత ప్రదేశం ఇదే..

ఇవీ కారణాలు..

» ఏ జలపాతమైనా ఎత్తైన కొండల పైనుంచి కిందికి జాలువారుతుంది. కొండ ప్రాంతాల్లో వర్షపు నీరు వరదలా మారి.. ఒక్కోసారి పైనుంచి వచ్చేది కలిసి ఉప్పెనలా లోతట్టు ప్రాంతాలవైపు దూసుకువస్తుంటాయి. అలాంటి సమయాల్లో జలపాతాల వద్దకు వెళ్లడం అంత క్షేమం కాదు.

» ప్రమాదాలు జరగకుండా జలపాతాల వద్ద హెచ్చరికబోర్డులు మాత్రమే ఏర్పాటు చేసి వదిలేయకుండా అక్కడ పర్యాటకులు హద్దుమీరితే వారిని నిలువరించేందుకు, ప్రమాదాలకు గురైతే రక్షించేందుకు అవసరమైన సిబ్బందిని అందుబాటులో ఉంచాల్సిన అవసరం ఉంది. జి.మాడుగుల మండలం కొత్తపల్లి జలపాతం వద్ద ఈ తరహా ఏర్పాట్లు ఉన్నాయి.



అతి ప్రమాదకరమైన పాములేరు

వల్సంపేట (గాదిగుమ్మి) జలపాతం



★ జలపాతాల వద్ద ఏకధాటిగా నీరు ప్రవహించడం వల్ల కింద ఉన్న బండ రాళ్లన్నీ నాచు పట్టి ఉంటున్నాయి. కొందరు యువకులు తలకు ఎలాంటి రక్షణ చర్యలూ లేకుండా ఆ రాళ్ల పైకెక్కి స్నానాలు, నృత్యాలు చేస్తున్నారు. స్వీయ చిత్రాల కోసం ప్రయత్నిస్తున్నారు. వీటి వల్లే ఒక్కోసారి కాలు జారి తలకు దెబ్బతగిలి ప్రమాదాల బారిన పడుతున్నారు.

ప్రమాదాల కట్టడికి ప్రత్యేక కమిటీ

ఏజెన్సీలో జలపాతాల వద్ద జరుగుతున్న ప్రమాదాలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రత్యేక కమిటీ నియమిస్తాం. సబ్ కలెక్టర్, పోలీసు, అటవీ శాఖల అధికారులతో కూడిన ఈ కమిటీ మన్యంలో చిన్న, పెద్ద జలపాతాలు ఎక్కడెక్కడున్నాయో గుర్తించి వాటిదగ్గర చేపట్టాల్సిన చర్యల గురించి సూచనలు చేస్తుంది. వర్షాలు ఎక్కువగా పడుతున్న సమయంలో పర్యాటకులు జలపాతాల దగ్గరకు వెళ్లకుండా అడ్డుకునేలా చర్యలు తీసుకుంటాం. ఐటీడీఏ నిర్వహించే జలపాతాల వద్ద అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పిస్తాం. హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నాం.

–అభిషేక్, ఐటీడీఏ, పీవో పాడేరు



అంగన్‌వాడీలకు కుళ్లిన గుడ్లు



అనంతగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: చిన్నారులు, గర్భిణులకు పోషకాహారం అందించేందుకు ప్రభుత్వం రూ.కోట్లాది నిధులు విడుదల చేస్తోంది. క్షేత్రస్థాయిలో అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కొన్నిచోట్ల ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

లంగుపర్తి పంచాయతీ పరిధిలోని రాయిపాడు అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు అందించిన గుడ్లన్నీ కుళ్లిపోవడంతో అవన్నీ పారబోస్తున్నారు. మండలంలోని ఇతర కేంద్రాల్లోనూ ఈ పరిస్థితి తలెత్తుతోంది. గుత్తేదారు నాణ్యమైన గుడ్లు పంపిణీ చేయడం లేదని పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు ఫిర్యాదు చేస్తున్నారు. అధికారులు పరిశీలించాలని తగు చర్యలు చేపట్టాలని గ్రామస్థులు రామన్న తదితరులు కోరుతున్నారు.

• బోర్డు మూసివేత

స్పందనకు వందనం

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు అయినా ఇంకా కొన్ని చోట్ల గత ప్రభుత్వ పథకాల పేరుతో ప్రకటన బోర్డులు దర్శనమిస్తున్నాయి. కొత్తపాలెం గ్రామ సచివాలయంపై నవరత్నాలు పథకం పేరుతో ఉన్న బోర్డు తీయలేదని ఈ నెల 25న 'ఈనాడు'లో 'ప్రభుత్వం మారినా.. పేర్లు మారలేదు' శీర్షికన వార్త ప్రచురితమైంది. దీనికి సంబంధిత అధికారులు స్పందించారు. ఈ బోర్డును రంగు కాగితాలతో మూసివేశారు.



భద్రాద్రి రామయ్యను దర్శించుకున్న ఎమ్మెల్యే



ఆలయంలో ఎమ్మెల్యే దంపతులు, కూటమి నాయకులు

ఎటపాక, న్యూస్‌టుడే: రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి, ఆమె భర్త, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు మఠం విజయభాస్కర్ బుధవారం భద్రాచలంలోని శ్రీ సీతారామ చంద్రస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు ఎమ్మెల్యే దంపతులను ఆలయ మర్యాదలతో ఆహ్వానించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి ఆశీర్వచనాలతోపాటు తీర్థప్రసాదాలు అందజేశారు. భద్రాచలం రామాలయ విశిష్టతను వివరించారు. పూజల్లో కూటమి నాయకులు పుట్టి రమేష్ బాబు, మారాసు గంగాధర్, ఏలూరి వెంకన్న, వల్లభనేని చందు తదితరులు ఉన్నారు.

ప్రయోగాత్మకంగా పారా గ్లైడింగ్

అరకులోయ/పట్టణం, న్యూస్‌టుడే: ఆంధ్రా ఊటీ అరకులోయను సందర్శించే పర్యటకులకు సరికొత్త అనుభూతి కలిగించేందుకు పాడేరు ఐటీడీఏ చర్యలు చేపడుతోంది. పారా గ్లైడింగ్‌ని అందుబాటులోకి తీసుకొస్తున్నారు. ఐటీడీఏ పీవో అభిషేక్ మంగళవారం సాయంత్రం అరకులోయ నుంచి పాడేరు తిరిగివెళ్తూ అరకు సమీపంలోని కిల్లోగుడ ఆశ్రమ పాఠశాల వెనుకభాగంలో పారాగ్లైడింగ్ చేసి కొత్త అనుభూతి పొందారు. దీనికి సంబంధించి అనుకూల, ప్రతికూల పరిస్థితులను ప్రస్తుతం అంచనా వేస్తున్నారు.



పారా గ్లైడింగ్‌లో ఎగురుతున్న ఐటీడీఏ పీవో అభిషేక్

పరిశ్రమల ఏర్పాటుకు సర్వే



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

పాడేరు, న్యూస్‌టుడే: గిరిజన ఉత్పత్తులతో గ్రామీణ చిన్నతరహా పరిశ్రమల పార్కులు ఏర్పాటు చేయడానికి సమగ్ర సర్వే చేపట్టాలని జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో పరిశ్రమలు, వ్యవసాయ, ఉద్యాన, డీఆర్‌డీఏ, పశు సంవర్థక శాఖలు, నైపుణ్యాభివృద్ధి సంస్థల అధికారులతో సమావేశం నిర్వహించారు. పాడేరు ఐటీడీఏ పరిధిలో చిన్నతరహా పరిశ్రమలు నెలకొల్పడానికి గల అవకాశాలపై చర్చించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి నేతృత్వంలో కమిటీ ఏర్పాటు చేయాలని చెప్పారు. చింతపల్లి మండలం గొందిపాకలు ప్రాంతంలో పరిశ్రమ నెలకొల్పితే గిరిజనులకు ప్రయోజనకరంగా ఉంటుందని అన్నారు. పైలట్ ప్రాజెక్టుగా చింతపల్లి మండలంలో దీన్ని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. స్వయం సహాయక సంఘాలను ఇందులో భాగస్వాములు చేయాలని పేర్కొన్నారు. ఛత్తీస్‌గఢ్ నుంచి వచ్చిన రూరల్ రినైస్సాన్స్ సంస్థ సంచాలకులు ప్రఖర్ అండ్లే.. తమ రాష్ట్రంలో గ్రామీణ చిన్నతరహా పరిశ్రమ పార్కు ఏర్పాట్లను పీపీటీ ద్వారా వివరించారు. పరిశ్రమలశాఖ జనరల్ మేనేజర్ శ్రీవాణిధర్‌రామన్, సహాయ సంచాలకుడు ఎం.నవీన్‌కుమార్, డీఆర్‌డీఏ పీడీ మురళి, జిల్లా వ్యవసాయాధికారి ఎస్.బి.ఎస్.నంద్, జిల్లా ఉద్యాన అధికారి రమేష్‌కుమార్‌రావు, పీహెచ్‌ఓ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు



కోటగున్నల వద్ద గిరిజనులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ శౌర్యమాన్ పటేల్

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: మారుమూల గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు చేపడుతున్నామని పాడేరు సబ్ కలెక్టర్ శౌర్యమాన్ పటేల్ అన్నారు. బుధవారం కుడుముసార పంచాయతీ కోటగున్నలు, నిమ్మపాడు, కోరుకొండ తదితర గ్రామాల్లో పర్యటించారు. కోటగున్నల గ్రామానికి చెందిన యువకుడు.. మారుమూల గ్రామాలకు తాగునీరు, రహదారులు తదితర సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నామని జాతీయ షెడ్యూల్డ్ ట్రైబ్ కమిషన్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో సబ్ కలెక్టర్ మారుమూల గ్రామాల్లో పర్యటించి గిరిజనులతో మాట్లాడి ప్రజలకు అందుతున్న ప్రభుత్వ సేవలను పరిశీలించారు. లోతుగెడ్డ వంతెన నుంచి బలపం, కోరుకొండ వరకు రహదారి నిర్మాణం, కొండపైనున్న గ్రామాలకు రహదారులు, వంతెనల నిర్మాణం, అంగన్‌వాడీ, సచివాలయ భవన నిర్మాణాలు, తాగునీరు తదితర సదుపాయాలు కల్పించాలని గ్రామస్థులు కోరారు. తహసీల్దారు రామకృష్ణ, ఈవోపీఆర్‌డీ శ్రీనివాసరావు, గ్రామస్థులు సింహాచలం, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన నియోజకవర్గస్థాయి క్రీడాపోటీలు



వాలీబాల్‌లో పోటీ పడుతున్న విద్యార్థులు

అరకులోయ/పట్టణం, న్యూస్‌టుడే: అరకులోయలో నిర్వహిస్తున్న నియోజకవర్గస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడా పోటీలు బుధవారంతో ముగిశాయి. రెండు రోజులపాటు నిర్వహించిన ఈ ఆటలకు వివిధ పాఠశాలల నుంచి విద్యార్థులు హాజరయ్యారు. 612 మంది వివిధ ఆటల్లో తలపడగా.. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను జిల్లాస్థాయికి ఎంపిక చేసినట్లు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి కొండబాబు తెలిపారు. బుధవారం వాలీబాల్, ఖోఖో, కబడ్డీ తదితర పోటీలను నిర్వహించారు. క్రీడా పాఠశాల ప్రిన్సిపల్ మూర్తి, ప్రధానోపాధ్యాయులు కెందు, మోరీ, ఎస్‌జీఎఫ్ మాజీ కార్యదర్శి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

సీతాఫలాలకు గిరాకీ



అనంతగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: కాశీపట్నం వారపు సంతలో బుధవారం సీతాఫలాలకు గిరాకీ నెలకొంది. 200 పండ్లు ఉండే ఒక కావిడి రూ.3 వేలు వరకు పలికింది. ఈ వారం సంతకు సీతాఫలాలు తక్కువగా రావడంతో వ్యాపారులు అధిక ధరలకు కొనుగోలు చేసి మైదాన ప్రాంతాలకు తరలించారు. దీంతో గిరిజన రైతులు సంతోషం వ్యక్తం చేశారు.

మడేరు వాగులో ఆంజనేయుడి విగ్రహం

రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: రాజవొమ్మంగి మండలం జడ్డంగి వద్ద మడేరు వాగు ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. వాగు ప్రవాహానికి బుధవారం ఆంజనేయ స్వామి విగ్రహం ఒడ్డుకు కొట్టుకుని వచ్చింది. ఇసుక దిబ్బల్లో బంగారు రంగులో విగ్రహం లభ్యమైందని తెలుసుకున్న సమీప ప్రజలు తరలి వెళ్లారు. విగ్రహాన్ని ఇసుక నుంచి బయటకు తీసి ప్రత్యేక పూజలు చేశారు. జడ్డంగి తీసుకువెళ్లి రామాలయంలో ఉంచారు. ముహూర్తం నిర్ణయించి మంచి ప్రదేశంలో ప్రతిష్ఠిస్తామని గ్రామస్థులు తెలిపారు. ఎస్సై చిన్నబాబు, ఎస్‌బీ హెచ్‌సీ దుర్గారావు, సొసైటీ మాజీ అధ్యక్షుడు జి.తాతారావు, లారీ యూనియన్ ఉపాధ్యక్షుడు సీహెచ్ వీరబాబు, గ్రామస్థులు పాల్గొన్నారు.





ఆంజనేయ స్వామి విగ్రహానికి పూజలు చేస్తున్న భక్తులు

పొలాల్లో మేట.. పండేనా పంట!


వలసపల్లిలో ఇసుక మేటలు వేసిన పొలాలు

సీలేరు, న్యూస్‌టుడే: ఈనెల 8న కురిసిన కుండపోత వర్షానికి తమ గ్రామాల్లో తీవ్ర నష్టం జరిగిందని, ఇంతవరకు ఒక్క అధికారి, నాయకుడు పర్యటించిన పాపాన పోలేదని దుప్పిలవాడ పంచాయతీ వలసపల్లి, మునసపల్లి వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం సీలేరు వచ్చిన వారు స్థానిక విలేకరులతో మాట్లాడారు. 17 రోజులు గడుస్తున్నా తమ గ్రామాల్లో జరిగిన నష్టాన్ని ఎవరూ గుర్తించలేదన్నారు. పంటపొలాలు నామరూపాలు లేకుండా పోయాయని, కొన్నిపొలాల్లో ఇసుక మేటలు వేశాయన్నారు. వాటిని బాగుచేసుకోవడానికి కూడా వీల్లేదన్నారు. తమ దిగువన ఉన్న వలసగెడ్డ కొత్తూరు, శాండికొరి గ్రామాలదీ ఇదే పరిస్థితని చెప్పారు. అధికారులు ఇప్పటికైనా తమ గ్రామాల్లో పర్యటించి న్యాయం చేయాలని కిముడు సిబో, మజ్జి గెన్ను, రాజారావు తదితరులు కోరారు.

కుష్ఠు వ్యాధి నివారణకు కృషి


తాజంగి పీహెచ్‌సీలో వైద్య పరీక్షలు చేస్తున్న జేడీ, డీఎంహెచ్‌వో

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: కుష్ఠు.. అంటువ్యాధి కాదని, ఇతరులకు సులభంగా సోకదని కుష్ఠు విభాగం రాష్ట్ర సంయుక్త సంచాలకుడు డాక్టర్ దేవసాగరం, నోడల్ అధికారి రమేశ్ అన్నారు. బుధవారం డీఎంహెచ్‌వో జమాల్‌బాషాతో కలసి లంబసింగి, తాజంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించారు. తాజంగి పీహెచ్‌సీలో కుష్ఠు రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. కొత్తపాలెం గ్రామంలో బాధితులతో మాట్లాడారు. కుష్ఠు నివారణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ వ్యాధి సోకినవారికి రోగనిరోధక శక్తి బలహీనంగా ఉంటుందని చెప్పారు. బాధితులు భయపడాల్సిన అవసరం లేదని, మందులు అన్ని పీహెచ్‌సీల్లో అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు.

రూ. కోటి జీతం... అయినా వద్దనుకున్నా!!

ముఖాముఖి

ఈనాడు, విశాఖపట్నం



జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగడానికి సవాళ్లను అధిగమించాలి. ఈ క్రమంలో 'రిస్క్' కూడా తీసుకోవాల్సి ఉంటుంది. ముఖ్యంగా సివిల్స్ సాధన చేసేవారికి ఒక రకమైన మొండి పట్టుదల ఉండాలి. అప్పుడే అనుకున్న లక్ష్యాన్ని చేరవచ్చు. ఉన్నంతలో సర్దుకుపోదాం అంటే ఎప్పటికీ మన కలలను నిజం చేసుకోలేం' అని ఈపీడీసీఎల్ సీఎండీ ఇమ్మడి పృథ్వితేజ్ చెబుతున్నారు.

ఈ యువ ఐఏఎస్ అధికారి సమయం చిక్కినప్పుడల్లా 'కెరీర్ గైడెన్స్' కార్యక్రమాల్లో పాల్గొని విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు. ఇటీవల ఆంధ్ర విశ్వవిద్యాలయంతో కలిసి సృజనాత్మక ఆవిష్కరణలను ప్రోత్సహించేలా 'హ్యాక్ ఏపీ హ్యాక్‌థాన్' కార్యక్రమాన్ని చేపట్టారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో 'అదర్ కెరీర్ ఆప్షన్స్' అనే కార్యక్రమం ద్వారా విద్యార్థులకు విలువైన సూచనలు చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో పలు ఉద్యోగాలకు నోటిఫికేషన్లు వచ్చాయి. మరిన్ని రాబోతున్నాయి. ప్రతి ఒక్కరూ కఠోర దీక్షగా శ్రమిస్తే ఆశించిన ఫలితం అందుకోవచ్చంటున్న పృథ్వీతేజ్... తాను ఐఏఎస్ సాధించిన తీరు, స్వీయ అనుభవాలను 'ఈనాడు'తో పంచుకున్నారు.

రిస్క్ తీసుకొని సివిల్స్ వైపు వచ్చా

రోజుకు 14 గంటలు కష్టపడ్డా.. ఫలితంగానే 24వ ర్యాంకు

శ్రద్ధ చూపితే మొదటి ప్రయత్నంలోనే విజయం సాధ్యం

'ఈనాడు'తో ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వితేజ్

విద్యార్థి దశ నుంచే బలమైన కోరిక: 'మాది ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ద్వారకా తిరుమల గ్రామం. మా నాన్న మొదట్లో కిరాణా దుకాణం నిర్వహించేవారు. తర్వాత చిన్న బంగారు ఆభరణాల దుకాణం నడుపుతున్నారు. నేను ఆరో తరగతి వరకు స్థానికంగానే చదువుకున్నా. ఏడో తరగతి నుంచి పదోతరగతి వరకు గుడివాడలో స్కూల్ హాస్టల్‌లో ఉండే చదువుకున్నా. అప్పుడే నాలో ఐఏఎస్ అవ్వాలనే కోరిక కలిగింది. 2011లో ఐఐటీ ప్రవేశ పరీక్ష రాసి జాతీయ స్థాయిలో మొదటి ర్యాంక్ సాధించినప్పుడు ఆ కోరిక మరింత బలపడింది.

● ముంబై ఐఐటీలో ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ పూర్తి చేశా. 2014 ప్రాంగణ ఎంపికల్లో సామ్‌సంగ్ కంపెనీలో ఉన్నత కొలువే దక్కింది. దక్షిణ కొరియాలో ఏడాదిపైగా ఉద్యోగం చేశాను. వార్షిక వేతనం రూ.కోటి పైనే. అయినా నాకు అది పెద్ద సంతృప్తినివ్వలేదు. సివిల్స్ పైనే మనసు ఉండిపోవడంతో ఇండియాకు వచ్చి తొలి ప్రయత్నంలోనే 24వ ర్యాంకు సాధించగలిగా. చిత్తూరులో ట్రైనీ కలెక్టర్‌గా శిక్షణ పూర్తిచేసుకున్నాక కడపలో సబ్ కలెక్టర్‌గా తొలి పోస్టింగ్ ఇచ్చారు. తర్వాత ట్రాన్స్‌కోలో జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్‌గా, ప్రస్తుతం ఈపీడీసీఎల్ సీఎండీగా పనిచేస్తూ సంస్థను అగ్రస్థానంలో నిలపడానికి కృషిచేస్తున్నా.



పెద్ద బహుమతే దక్కింది..

ఇంజినీరింగ్ తర్వాత రూ.కోటి వార్షిక వేతనంతో కూడిన ఉద్యోగాన్ని వదులుకుని సివిల్స్ వైపు రావాలనుకోవడం కొంచెం రిస్కే. అయినా నా లక్ష్యం ముందు అది చిన్నదిగానే అనిపించింది. అమ్మ, నాన్న కూడా నన్ను ప్రోత్సహించారు. 2016 చివర్లో దక్షిణ కొరియా నుంచి దిల్లీ వచ్చాను. అప్పటికే శిక్షణ సంస్థల్లో కోర్సులు చివరికి వచ్చేశాయి. దీంతో కేవలం మూడు నెలలు మాత్రమే క్రాష్ కోర్సు శిక్షణ తీసుకున్నాను. నాకు ఇష్టమైన గణితాన్నే ఐచ్ఛికంగా ఎంచుకుని సొంతంగా సాధన చేశా. పాత పేపర్లతో పాటు సీనియర్ల సూచనలు తీసుకుని రోజుకు 14 గంటలు పాటు చదివి తొలి ప్రయత్నంలోనే 24వ ర్యాంకు సాధించడంతో పడ్డ కష్టం, చేసిన రిస్క్‌కు పెద్ద బహుమతే దక్కింది.

ఏకాగ్రతతో చదవాలి..

జనరల్ కేటగిరీలో సివిల్స్ రాయడానికి ఆరు సార్లు అవకాశం ఉంటుంది. అన్ని అవకాశాలున్నాయి కదా.. ఏదో ఒక ఏడాది పోస్టు కొట్టొచ్చు అనేలా సాధన చేయకూడదు. ఒకటి, రెండు ప్రయత్నాల్లోనే కొలువు సాధించేలా ఏకాగ్రతతో చదువుతుండాలి. నోటిఫికేషన్ వచ్చినప్పుడు మూడు గంటలు చదువుదాం.. పరీక్ష దగ్గర పడుతున్నప్పుడు పది గంటలు చదివేద్దాం అంటే కుదరదు. మనం ఏ ఉద్యోగమైతే కొట్టాలనుకుంటున్నామో దానికి సంబంధించిన సబ్జెక్టులను తొలి రోజు నుంచే కనీసం 10 నుంచి 12 గంటలు సాధన చేస్తేనే విజయం సాధించడానికి అవకాశం ఉంటుంది. నేను ఎక్కడికి వెళ్లినా విద్యార్థులకు ఇదే చెబుతుంటా. కష్టే.. ఫలి అనే సూత్రాన్ని నమ్ముతుంటా. సివిల్స్ అనే కాదు...గ్రూప్స్, ఇతరత్రా ఏ పోటీ పరీక్షలకైనా ఇదే వర్తిస్తుంది.

పరిహారం ఎప్పటికిస్తారు?

వరరామచంద్రాపురం, న్యూస్‌టుడే: నెలలు గడిచిపోతున్నా.. తమ ఇళ్ల పరిహారానికి అంచనా నోటీసులు ఇవ్వడంలేదని మాజీ సర్పంచి రత్తకుమారి, భాజపా నాయకులు సోంది నాగేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. 'మండలంలోని చర్లతోగుడెంలో 29 కుటుంబాల ఇళ్ల కట్టడాలకు సంబంధించిన పరిహారం నోటీసులు ఇవ్వలేదు. గ్రామంలో మిగిలిన వారికి పరిహారం దస్త్రాలు అందించి, దాదాపుగా ఎనిమిది నెలలు కావస్తోంది. అధికారులను నిలదీస్తే.. వారంలో పంపిణీ చేస్తామని చెప్పి, ఇప్పటివరకు ఏ అధికారి రాలేదు. మమ్మల్ని పట్టించుకోవడంలేదు' అని వాపోయారు. ఈ విషయాన్ని చింతూరు ఐటీడీఏ పీవో దృష్టికి తీసుకువెళ్తామన్నారు. మండలంలోని చాలా గ్రామాల్లో ఇదే పరిస్థితి ఉందన్నారు.

రైతులకు మినప విత్తనాల పంపిణీ

మోతుగూడెం, న్యూస్‌టుడే: వై.రామవరం మండలం బొడ్డగండి పంచాయతీ పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన 100 మంది గిరిజన రైతులకు వ్యవసాయ శాఖ ద్వారా 90 శాతం రాయితీపై వీబీఎన్-8 రకానికి చెందిన ఆరు క్వింటాళ్ల మినప విత్తనాలను బుధవారం పంపిణీ చేశారు. సర్పంచి వేమ సంధ్యారాణి, ఎంపీటీసీ సభ్యుడు కరకా వెంకటరమణ వీటిని అందజేశారు. కూటమి నాయకులు నీలాపు సత్యనారాయణ, కిముడు మూర్తి, వ్యవసాయ అధికారి సుస్మా, పలువురు రైతులు పాల్గొన్నారు.


విత్తనాలు పంపిణీ చేస్తున్న సర్పంచి, ఎంపీటీసీ సభ్యులు సంధ్యారాణి, వెంకటరమణ

రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం


అంజలిశనివారంలో గోడపత్రికలు ఆవిష్కరిస్తున్న అధికారులు

ముంచంగిపుట్టు, పెదబయలు గ్రామీణం, డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని తెదేపా అరకులోయ నియోజకవర్గ ఇన్‌ఛార్జి దొన్నుదొర అన్నారు. బుధవారం కించాయిపుట్టు పంచాయతీలోని పెద్దపుట్టులో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొని గోడపత్రికలు ఆవిష్కరించారు. మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసులు పాల్గొన్నారు. పెదగుడ పంచాయతీ గూడమామిడిపుట్టు గ్రామంలో ఈ కార్యక్రమం జరిగింది. సర్పంచి సుభాష్‌చంద్ర, వైస్ ఎంపీపీ సత్యనారాయణ పాల్గొన్నారు. రూఢకోట సచివాలయ పరిధిలోని కొరవంగి గ్రామంలో ఏవో శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. తెగుళ్ల నివారణపై అవగాహన కల్పించారు. కురిడిలో ఏవో నీలవేణి మాట్లాడుతూ.. ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. అంతకుముందు అరకు రైతు సేవా కేంద్రంలో సిబ్బందితో సమావేశమయ్యారు. సర్పంచి శారద, ఏహెచ్ఏలు త్రినాథరావు, రమేష్ పాల్గొన్నారు.

అనంతగిరి గ్రామీణం, అరకులోయ పట్టణం: కాశీపట్నం పంచాయతీ బంగారంపేట, పల్లంలంక గ్రామాల్లో వ్యవసాయాధికారి కె. ఉమామహేశ్వర ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. పశువైద్యాధికారి గణేశ్వరావు, ఉద్యానాధికారిణి శిరీష, ఉద్యాన సహాయకులు దొరబాబు పాల్గొన్నారు. చొంపి గ్రామంలో వరిలో తెగుళ్ల నివారణకు చేపట్టాల్సిన చర్యలపై ఏవో పణిరాజ్ అవగాహన కల్పించారు.

చింతపల్లి, కొయ్యూరు, జి.మాడుగుల, న్యూస్‌టుడే: గిరిజన ప్రాంతాల్లో ఉద్యాన పంటలసాగుతో లాభాలు సాధించవచ్చని చింతపల్లి ఉద్యాన పరిశోధనాస్థానం శాస్త్రవేత్త చెట్టి బిందు అన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమం అంజలీశనివారం పంచాయతీలో జరిగింది. గిరిజన ప్రాంతానికి అనువైన కాఫీ, మిరియాలు, అల్లం, పసుపు, పిప్పళ్ల సాగులో తీసుకోవాల్సిన చర్యలను బిందు వివరించారు. పశువైద్యాధికారి శాలిని, వైస్ ఎంపీపీ సాగిన వెంగళరావు, సర్పంచి పేట్ల రాజుబాబు తదితరులు పాల్గొన్నారు. కన్నంపేట, కొమ్మిక రైతు సేవా కేంద్రాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. సోలబం పంచాయతీ తానేరుఘాటులో జరిగిన కార్యక్రమంలో సర్పంచి హనుమంతరావు, రైతు ఉత్పత్తిదారుల సేవా సంఘం యూనిట్ ఇన్‌ఛార్జి మహేశ్వరి, వీహెచ్ఏ నీలిమ, సిబ్బంది పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: ప్రకృతి విధానంలో సాగు చేయడం ద్వారా భూసారం కోల్పోకుండా ఆరోగ్యకరమైన పంట దిగుబడులు సాధించవచ్చని ప్రకృతిసాగు ఎంసీఆర్పీ కె.అప్పలరాజు అన్నారు. వాతంగి, ఓగిపాలెం, కొమరాపురం గ్రామాల్లో రైతులకు జీవద్రవ్య ద్రావణం తయారీ విధానంపై శిక్షణ ఇచ్చారు. ఏసీఆర్పీలు లోవరాజు, పాపారావు, సత్యనారాయణ, లోవ శాంతి పాల్గొన్నారు.


వాతంగిలో అవగాహన కల్పిస్తున్న ఎంసీఆర్పీ

సీసీ రోడ్డు సౌకర్యం కల్పించరూ..


పోతవరం నుంచి పునరావాస కాలనీ రోడ్డు ఇలా..

దేవీపట్నం, న్యూస్‌టుడే: పునరావాస కాలనీకి సీసీ రోడ్డు నిర్మించాలని ముంపు గ్రామాల నిర్వాసితులు కోరుతున్నారు. దేవీపట్నం మండలంలో ముంపు గ్రామాలైన మూలపాడు, మెట్ట వీధి, కొడవలికొండ గ్రామాలకు పోతవరం-చిన్నారగండి మధ్యలో పునరావాస కాలనీ నిర్మించారు. పోతవరం నుంచి కాలనీకి వెళ్లే రోడ్డు మార్గం అంతా గుంతలు పడి అధ్వానంగా మారడంతో నిత్యం రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని నిర్వాసితులు ఆందోళన చెందుతున్నారు. కాలనీకి కూత దూరంలో చిన్నారగండి గ్రామానికి వెళ్లే గిరిజనులకు రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు. గతంలో పునరావాస కాలనీకి వచ్చిన ప్రతి అధికారికి రోడ్డు సౌకర్యం కల్పించాలని వేడుకున్నా నేటికీ ఫలితం లేదన్నారు. ఐటీడీఏ అధికారులు చర్యలు తీసుకుని రహదారి సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.

పాడేరులో దీన్‌దయాల్ జయంతి

పాడేరు, న్యూస్‌టుడే: పండిట్ దీన్ దయాల్ జయంతి వేడుకలను పాడేరులో భాజపా నాయకులు ఆధ్వర్యంలో నిర్వహించారు. కొత్తపాడేరులో భాజపా రాష్ట్ర గిరిజన మోర్చా అధ్యక్షులు కురుసా ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో దయాల్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ.. దయాల్ సేవలను కొనియాడారు. భాజపా జిల్లా ప్రధాన కార్యదర్శి సల్లా రామకృష్ణ, కురుసా రాజారావు తదితరులు పాల్గొన్నారు.


దయాల్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న భాజపా గిరిజన మోర్చా అధ్యక్షులు ఉమామహేశ్వరరావు తదితరులు

క్యాన్సర్ బాధితుడికి సాయం

అడ్డతీగల, న్యూస్‌టుడే: వీరభద్రపురం గ్రామానికి చెందిన పందిరి అభిషేక్ రెండేళ్లుగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ మంచానికే పరిమితమయ్యారు. స్థానిక కూటమి నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే శిరీషాదేవి, తెలుగు యువత అధ్యక్షుడు మఠం భాస్కర్ వెంటనే స్పందించి సొంత ఖర్చులతో అంబులెన్స్ ఏర్పాటు చేసి బుధవారం రాత్రి గుంటూరు క్యాన్సర్ ఆసుపత్రికి తరలించారు. తక్షణ ఖర్చుల నిమిత్తం కొంత ఆర్థిక సాయం అందజేశారు. కూటమి నాయకులు బూర్లె హరిబాబు, ఎడ్ల శ్రీను, బొదిరెడ్డి త్రిమూర్తులు, వీరారెడ్డి, రాజేశ్వర్, కుప్పాల జయరాం పాల్గొన్నారు.

గల్లంతైన వైద్య విద్యార్థి ఆచూకీ ఎక్కడ?


కల్వర్టుల్లో గాలిస్తున్న బృందాలు

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: మారేడుమిల్లి సమీపాన 'జలతరంగిణి' జలపాతంలో ఆదివారం గల్లంతైన ప్రకాశం జిల్లా మార్కాపురానికి చెందిన వైద్య విద్యార్థి సీహెచ్ హరదీప్ (20) ఆచూకీ ఇప్పటికీ లభించలేదు. పోలీసు, అటవీ, రెవెన్యూ శాఖల అధికారులు స్థానికులతో కలిసి, ఎన్డీఆర్ఎఫ్ బృందాల సాయంతో విస్తృతంగా గాలిస్తున్నారు. ఒకవేళ విద్యార్థి వాగు ప్రవాహవేగానికి పక్కనే ఉన్న పాములేరు వాగులోకి కొట్టుకుని పోయి ఉంటాడేమో అనే కోణంలోనూ గాలింపు ముమ్మరం చేశారు. డ్రోన్ల సహాయంతో వాగుల వెంబడి తనిఖీలు చేయడమే కాకుండా, కొండలు, అటవీ ప్రాంతాల్లోనూ ప్రత్యేక దళాలతో వెదుకులాట ప్రారంభించారు. కల్వర్టుల వద్ద ఏర్పడిన ఇసుక దిబ్బలలు తొలగించి మరీ గాలిస్తున్నారు. రంపచోడవరం ఏఎస్పీ జగదీశ్ అడహళ్లి ఆధ్వర్యంలో మారేడుమిల్లి సీఐ సీహెచ్ గోపాలకృష్ణ, తహసీల్దార్ సుబ్బారావుతోపాటు అటవీ శాఖ అధికారులు గాలింపు చర్యల్లో పాల్గొంటున్నారు. కాగా గల్లంతై ఇప్పటికే నాలుగు రోజులు కావడంతో కుటుంబ సభ్యులు, బంధువుల్లో తీవ్ర నిరాశ, నిస్పృహ అలముకుంటున్నాయి. అధికారులు మాత్రం గాలింపు చర్యలను ముమ్మరంగా కొనసాగిస్తూనే ఉన్నారు.

ఆదివాసీ చట్టాలు అమలు చేయాల్సిందే


అరకులోయ ప్రజా సంఘాల నాయకులు, గిరిజనుల ర్యాలీ

అరకులోయ పట్టణం, న్యూస్‌టుడే: గిరిజన ప్రాంతంలో ఆదివాసీ చట్టాలు పక్కాగా అమలు చేసి, గిరిజనేతరుల ఆక్రమణలపై చర్యలు చేపట్టాలని ఆదివాసీ జేఏసీ కన్వీనర్ రామారావుదొర డిమాండ్ చేశారు. 1/70 చట్టం, జీఓ నం 3, ఆదివాసీ చట్టాలు అమలు చేయాలని, గిరిజనేతరుల ఆక్రమణలకు కొమ్ముకాస్తున్న అధికారులపై చర్యలకు డిమాండ్ చేస్తూ జేఏసీ ఆధ్వర్యంలో అరకులోయలో ర్యాలీ, నిరసన చేపట్టారు. రామారావుదొర మాట్లాడుతూ.. అరకులోయలో గిరిజనేతరుల ఆక్రమణలు పెరిగిపోయాయని ఆరోపించారు. తహసీల్దారు కార్యాలయం సమీపంలోని గిరిజనేతరుడి కట్టడంపై స్థానిక అధికారులు, ఐఏఎస్‌లకు, జాతీయ ఎస్టీ కమిషన్ దృష్టికి తీసుకెళ్లినా చర్యలు లేకపోవడం శోచనీయమన్నారు. జేఏసీ నాయకులు గోపాల్, మహదేవ్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

కొండచిలువ కలకలం


గంగవరంలో ఓ బావిలో ఇలా..

గంగవరం, న్యూస్‌టుడే: ఓ ఇంటి బావిలో కొండచిలువ చూసి ఆ ఇంట్లో వారు భయభ్రాంతులకు గురైన ఘటన గంగవరంలో బుధవారం చోటుచేసుకుంది. గంగవరంలోని బొడ్డేటి సుబ్రహ్మణ్యం ఇంటి ఆవరణలో ఉన్న బావిలో నీటిని తోడేందుకు ఇంట్లో వారు వెళ్లారు. బావిలో భారీ కొండ చిలువ కంటపడింది. దానిని చూసి వారు భయంతో కేకలు వేయడంతో చుట్టుపక్కల వారంతా చేరారు. విషయాన్ని అటవీశాఖ సిబ్బందికి తెలియజేసినా ఎంతసేపటికి ఎవరూ రాకపోవడంతో స్థానిక యువత చరవాణిలో ఫోక్స్‌పేట రేంజర్ కరుణాకర్‌తో మాట్లాడి ఆయన సూచనలతో కర్రసాయంతో పామును బయటకు తీశారు. అక్కడి నుంచి సంచిలో వేసే క్రమంలో అదిజారి పక్కనున్న పొదల్లోకి జారుకుంది. అటవీ శాఖ సిబ్బంది పట్టుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

75 లక్షల మొక్కల పెంపకానికి ప్రతిపాదనలు


జొన్నమామిడి సమీపంలో అటవీ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సీసీఎఫ్ శ్రీకంఠనాథరెడ్డి

సీలేరు, న్యూస్‌టుడే: ఉత్తరాంధ్రలో 75 లక్షల మొక్కలు పెంచడానికి ప్రతిపాదనలు సిద్ధం చేశామని విశాఖ సర్కిల్ అటవీ ముఖ్య సంరక్షణాధికారి శ్రీకంఠనాథరెడ్డి తెలిపారు. సీలేరు ఎత్తిపోతలు ప్రాజెక్టుకు సంబంధించి అటవీ అనుమతుల కోసం సీలేరులో ఆయన పర్యటించారు. ముందుగా ఎత్తిపోతలు ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమైన టన్నెల్ తవ్వగా వచ్చిన మట్టిని నిల్వచేయడానికి ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డ్‌ను పరిశీలించారు. జలాశయం నుంచి నీటిని టన్నెల్‌కు పంపించే ప్రదేశాన్ని చూశారు. తర్వాత జలవిద్యుత్కేంద్రం నిర్మించే అటవీ ప్రాంతం ఉన్న పార్వతీనగర్‌ను పరిశీలించారు. అటవీ అనుమతుల చట్టం ప్రకారం ఎత్తిపోతలు ప్రాజెక్ట్‌కు అనుమతులు ఇస్తామని సీసీఎఫ్ తెలిపారు. అనంతరం స్థానిక విలేకరులతో మాట్లాడారు. అటవీ పర్యటకం అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. లంబసింగి వద్ద కృష్ణాపురంలో పర్యావరణ పర్యటక ప్రాజెక్టు పనులు తుది దశకు చేరుకున్నాయని పేర్కొన్నారు. డీఎఫ్‌వో సూర్యనారాయణ పడాల్, రేంజి అధికారి శ్రీనివాసరావు, ఉప రేంజి అధికారి సింహాచలం పడాల్, ముఖ్య ఇంజినీరు వాసుదేవరావు, ఎస్ఈలు చంద్రశేఖర్‌రెడ్డి, రామభద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల పనులు పూర్తి చేయాలి


బూదరాళ్లలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న పీడీ బాబు

కొయ్యూరు, న్యూస్‌టుడే: ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై)లో 2016-17, 18, 2021-22 మధ్యలో మంజూరైన గృహాలను అక్టోబర్ 31 నాటికి పూర్తి చేయాలని గృహ నిర్మాణ సంస్థ పీడీ బి.బాబు తెలిపారు. బుధవారం ఆయన బూదరాళ్లలో గృహ నిర్మాణ లబ్ధిదారులతో సమావేశమయ్యారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో మేరీరోజ్‌తో కలిసి ఏపీఎం, ఏపీవో, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో మన ఇల్లు- మన గౌరవం కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడారు. జిల్లాలో 2016 నుంచి నేటి వరకు 2498 గృహ నిర్మాణాలు శ్లాబు వేసి వదిలేశారన్నారు. పీఎం జన్‌మన్ పథకంలో భాగంగా 25,363 మంది పీవీటీజీ గిరిజనులకు గృహాలు మంజూరైనట్లు పేర్కొన్నారు. ఒక్కో నిర్మాణానికి ప్రభుత్వం రూ.2.39 లక్షలు అందిస్తుందన్నారు. గృహ నిర్మాణశాఖ ఏఈ గోవిందరాజు, డిజిటల్ అసిస్టెంట్ ధనుష్ పాల్గొన్నారు.

గిరిజనులకు బైండోవర్ నోటీసులు తగదు

ఎటపాక, న్యూస్‌టుడే: ఎటపాక గిరిజనులకు తహసీల్దార్ బైండోవర్ నోటీసులు ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తూ గిరిజన సంఘం నాయకులు బుధవారం చింతూరు ఐటీడీఏ పీఓకి వినతిపత్రం అందజేశారు. దీని వెనుక రాజకీయ ఒత్తిడి ఉందని, అధికారులు అత్యుత్సాహం ప్రదర్శించారని ఆరోపించారు. గిరిజనులు, గిరిజనేతరులు సామరస్యంగా మెలుగుతున్నామని తెలిపారు. ఈ నోటీసులపై న్యాయపోరాటం చేస్తామని, జాతీయ ట్రైబల్ కమిషన్, జాతీయ మానవ హక్కుల కమిషన్, జిల్లా కలెక్టర్‌లకు లేఖలు రాస్తామన్నారు. గిరిజన సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు కాకా అర్జున్‌దొర, ఇరపా అజయ్‌కుమార్, గిరిజన నాయకులు సోందే కురసం రాజశేఖర్, తెల్లం చినరాయణ, గండి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

శుభ్రతతో ఆరోగ్యకర సమాజం


డుంబ్రిగుడలో విద్యార్థుల ర్యాలీ

డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: గిరిజన గ్రామాలను పరిశుభ్రంగా ఉంచి స్వచ్ఛభారత్ లక్ష్యాన్ని నెరవేరుద్దామని కాఫీ బోర్డు జూనియర్ లైజనింగ్ జూనియర్ అధికారి శ్రీనివాస్, కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ చంద్రశేఖర్ అన్నారు. డుంబ్రిగుడలో కాఫీ బోర్డు ఆధ్వర్యంలో స్వచ్ఛతే సేవా కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. కళాశాల నుంచి మూడు రోడ్ల కూడలి వరకు విద్యార్థులు ర్యాలీ చేపట్టారు. పరిసరాల శుభ్రతతో ఆరోగ్యకర సమాజం ఏర్పడుతుందన్నారు. కాఫీ బోర్డు అధికారులు రవికుమార్, లక్ష్మి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వరరామచంద్రాపురం, న్యూస్‌టుడే: గ్రామాలు ఎంత పరిశుభ్రంగా ఉంటే, ప్రజలు అంత ఆరోగ్యంగా ఉంటారని ఎంపీపీ కారం లక్ష్మి వివరించారు. రామవరంలో బుధవారం నిర్వహించిన స్వచ్ఛభారత్ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. తొలుత గ్రామంలోని కొన్ని రహదారులు పారిశుద్ధ్య కార్మికులతో కలిసి శుభ్రం చేశారు. వీధుల్లో ప్రదర్శన చేశారు. సచివాలయంలోని రైతుసేవా కేంద్రంలో రైతులకు రాయితీపై విత్తనాలు అందించారు. సర్పంచి లక్ష్మి, పంచాయతీ కార్యదర్శి తాతారావు, వడ్లాది రమేశ్, గ్రామస్థులు పాల్గొన్నారు.

అరకులోయ పట్టణం, న్యూస్‌టుడే: పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులు భాగస్వామ్యం కావాలని నెహ్రూ యువకేంద్రం జిల్లా యూత్ అధికారి జి మహేశ్వరరావు అన్నారు. అరకులోయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విశాఖ నెహ్రూ యువకేంద్రం, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో స్వచ్ఛతే సేవా కార్యక్రమం నిర్వహించారు. పెదలబుడు ఉప సర్పంచి విజయనిర్మల ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ప్రిన్సిపల్ నాయక్, ఎన్ఎస్ఎస్ పీఓలు నాగబాబు, విజయలక్ష్మి, అనితకుమారి, అధ్యాపక సిబ్బంది, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	107	98
లైవ్	129	118
డ్రెస్డ్	187	206
స్కిన్‌లెస్	213	216

జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక


ఎంపికైన విద్యార్థినులతో ఉపాధ్యాయులు

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే: స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల-2లోని 14 మంది విద్యార్థినులు నియోజకవర్గ, మండల స్థాయి క్రీడాపోటీల్లో విశేష ప్రతిభ కనబరిచి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. స్కూల్ గేమ్స్ పెదబయలు ఆధ్వర్యంలో అరకులోయలో నిర్వహించిన పోటీల్లో ఖోఖోలో ఎం.బిందుప్రసన్న, దివ్యప్రశాంతి, నందిని ప్రతిభ కనబరిచి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారని హెచ్ఎం ఎంపీసీ ప్రకాష్ తెలిపారు. కబడ్డీ పోటీల్లో త్రిష, అథ్లెటిక్స్‌లో మరో 14 మంది విద్యార్థినులు జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారని చెప్పారు. విద్యార్థినులను వ్యాయామ ఉపాధ్యాయులు అశోక్‌కుమార్, నీలకంఠంలను అభినందించారు.

దారకొండ దారిలో కష్టాలు


నూతిబంద సమీపంలో బురదలో వాహనదారుల పాట్లు

గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే: గూడెంకొత్తవీధి- దారకొండ మధ్య రహదారిలో ప్రయాణం ప్రమాదకరంగా మారింది. పదిహేను రోజుల క్రితం కురిసిన వర్షాలకు రహదారులు ఛిద్రమయ్యాయి. తాత్కాలికంగా మట్టి వేసి మరమ్మతులు చేపట్టారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు వేసిన మట్టి బురదగా మారి వాహనాలు కూరుకుపోతున్నాయి. బుధవారం గూడెంకొత్తవీధి నుంచి దారకొండ వెళుతున్న వాహనాలు లంకపాకలు సమీపంలో బురదలో కూరుకుపోయాయి. స్థానికులు అతి కష్టం మీద వాటిని తీశారు.

అయిదేళ్లూ గొప్పలు.. అన్నదాతకు అవస్థలు

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే

రైతులకు చెంతనే సేవలందిస్తామంటూ గత వైకాపా ప్రభుత్వం గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలను ప్రారంభించింది. వీటికి భవనాలు నిర్మించడం, పనులు పూర్తయిన చోట్ల వసతులు కల్పించడంలో మాత్రం విఫలమైంది. రైతు భరోసా కేంద్రాల(ప్రస్తుతం రైతు సేవా కేంద్రాలు) నిర్మాణాలు ఏళ్లు గడుస్తున్నా అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. దీంతో రైతులు, సిబ్బందికి ఇబ్బందులు తప్పడం లేదు. కి.మీ.ల దూరం వెళ్లి విత్తనాలు, ఎరువులు తెచ్చుకోవాల్సి వస్తోంది. ముంచంగిపుట్టు మండలంలోని 23 పంచాయతీల్లోని 18 గ్రామ సచివాయాల పరిధిలో 18 ఆర్‌బీకేలను ఏర్పాటు చేశారు. ప్రతి కేంద్రానికి భవనాలు నిర్మించేందుకు రూ.20 లక్షలు చొప్పున కేటాయించారు. దారెల, బరడ, బంగారుమెట్టలో మాత్రమే పనులు పూర్తయ్యాయి. మిగతా చోట్ల అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి.

విద్యుత్తు సదుపాయం లేక..

దారెల, బరడ గ్రామాల్లో కేంద్రాల ప్రారంభోత్సవం జరిగినా వాటికి కనీసం విద్యుత్తు సదుపాయం కూడా కల్పించలేదు. భవనాలు రైతులకు ఉపయోగపడటం లేదు. దారెలలో భవనం వినియోగించక భవనం చుట్టూ తుప్పలు పెరిగాయి. పంచాయతీ పరిధిలో ఉన్న 14 గ్రామాల రైతులు ఐదు కి.మీ.ల దూరంలో ఉన్న కిలగాడ, బంగారుమెట్ట పంచాయతీలకు వెళ్లి విత్తనాలు తెచ్చుకోవాల్సి వస్తోంది.

ఆ భవనాలు పూర్తయ్యేనా..

ఏనుగురాయి, వనుగుమ్మ, దోడిపుట్టు, జోలాపుట్టు, మాకవరం తదితర 15 గ్రామ


కిలగాడలో సామాజిక భవనంలో నిర్వహిస్తున్న ఆర్‌బీకే, పశువైద్యశాల


దారెలలో విద్యుత్తు సదుపాయం లేని ఆర్‌బీకే

సచివాలయాల పరిధిలో భవన నిర్మాణాలు పూర్తి కాలేదు. పంచాయతీ, సామాజిక భవనాల్లో విత్తనాలు ఉంచి రైతులకు పంపిణీ చేయాల్సి వస్తోంది. కిలగాడలో సామాజిక భవనంలోనే ఆర్బీకే, పశు వైద్యశాలలు నిర్వహిస్తున్నారు. ఈ పనులు పూర్తి చేసి విత్తనాలు, వ్యవసాయ పరికరాలు ఎరువులు అందుబాటులో ఉంచితే, సాగుకు అనుకూలంగా ఉంటుందని రైతులు చెబుతున్నారు.

ఇంజినీరింగ్ అధికారుల దృష్టికి..

దారెల, బంగారుమెట్ట, బరడ గ్రామాల్లో భవనాలు పూర్తయ్యాయి. వాటిలో రెండింటికి విద్యుత్తు సదుపాయం లేక బంగారుమెట్ట ఆర్బీకేను వినియోగిస్తున్నాం. జోలాపుట్టు, మాకవరం పరిధిలోని రైతులకు లబ్బూరులో జేసీస్ భవనంలో విత్తనాలు పంపిణీ చేశాము. అన్ని చోట్ల పనులు పూర్తి చేయాలని సంబంధిత ఇంజినీరింగ్ అధికారులను కోరాం.

– శ్రీనివాసబాబు, మండల వ్యవసాయ శాఖ అధికారి, ముంచంగిపుట్టు

నేడు విద్యుత్తు సరఫరా అంతరాయం

పాడేరు, న్యూస్‌టుడే: మరమ్మతు పనుల నిమిత్తం పాడేరు, జి.మాడుగుల మండలాల్లో ఈనెల 26వ తేదీ గురువారం మధ్యాహ్నం 1 గంట నుంచి 2 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ అప్పారావు తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

సర్వసభ్య సమావేశం..

వై. రామవరం, న్యూస్‌టుడే: వై. రామవరం మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో గురువారం మండల సర్వసభ్య సాధారణ సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ బాబ్జీ దొర తెలిపారు. ఎంపీపీ ఆనందరావు అధ్యక్షతన నిర్వహించే ఈ కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు తప్పకుండా హాజరుకావాలని కోరారు.

ఈపీఎఫ్‌ఓ 'నిధి ఆప్‌కే నికట్' రేపు

రాజమహేంద్రవరం: ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ(ఈపీఎఫ్‌ఓ) రాజమహేంద్రవరం ప్రాంతీయ కార్యాలయం పరిధిలోని జిల్లాల్లో 'నిధి ఆప్‌కే నికట్' శిబిరాలు ఈ నెల 27న నిర్వహించనున్నట్లు సహాయ పీఎఫ్ కమిషనర్ వై.డి.శ్రీనివాస్ బుధవారం తెలిపారు. అల్లూరి సీతారామరాజు జిల్లాకు సంబంధించి వై.రామవరం మండలం పి.యర్రగొండ ఏపీటీడబ్ల్యూఆర్ జూనియర్ కళాశాల, గంగవరం మండలంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాల, మారేడుమిల్లి పంచాయతీ కార్యాలయం వద్ద ఈ శిబిరాలు జరుగుతాయన్నారు. పీఎఫ్ ఖాతాదారులు, పింఛనుదారులతో పాటు ఎస్టాబ్లిష్మెంట్లు పాల్గొని ఫిర్యాదులు అందించవచ్చని పీఎఫ్ కమిషనర్ పేర్కొన్నారు.

అ వీ ఇ వీ

పశువులకు టీకాలు

అనంతగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: కాశీపట్నం పరిధిలోని బంగారంపేటలో పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. మూగజీవాలకు గాలికుంటు వ్యాధి రాకుండా టీకాలు వేసినట్లు పశువైద్యాధికారి గణేశ్వరరావు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలను రైతులకు వివరించారు. మండల వ్యవసాయాధికారి, ఉద్యానవన అధికారి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నేతల ఆందోళన

పాడేరు, న్యూస్‌టుడే: 'బాబూ తల్లికి వందనం ఎక్కడ.. సూపర్ సిక్స్ ఎక్కడ' అంటూ కాంగ్రెస్ పార్టీ నాయకులు బుధవారం జిల్లా కలెక్టరేట్ వద్ద నిరసన చేపట్టారు. డీసీసీ అధ్యక్షులు సతక బుల్లిబాబు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం 100 రోజుల పాలనకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎన్నికల హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. పార్టీ శ్రేణులు పాల్గొన్నాయి.

రెండు వారాల్లోనే రోడ్డు నిర్మాణం

కొయ్యూరు, న్యూస్‌టుడే: అర్జీ పెట్టిన రెండు వారాల్లోనే రోడ్డు పనులు పూర్తిచేయించిన ఐటీడీఏ పీవో అభిషేక్‌కు బూదరాళ్ల సర్పంచి సాగిన ముత్యాలమ్మ, వార్డు సభ్యుడు సంజీవ్, స్థానిక గిరిజనులు కృతజ్ఞతలు తెలిపారు. గూడెంకొత్తవీధి మండలం గరికబంద నుంచి కొయ్యూరు మండలం బూదరాళ్ల పంచాయతీలోని గరిమండ వరకు రెండున్నర కిలోమీటర్ల రోడ్డు పనులు పూర్తికావడంతో గిరిజనులు హర్షం వ్యక్తం చేశారు.

మట్టిలో కూరుకుపోయిన లారీ

పాడేరు, న్యూస్‌టుడే: పాడేరు ఘాట్‌రోడ్డు పక్కన కేబుల్ కోసం తీసిన గుంతలు పూడ్చక పోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. బుధవారం మైదాన ప్రాంతం నుంచి పాడేరుకు సిమెంట్ లోడుతో వస్తున్న లారీ ఎదురుగా వస్తున్న బస్సును తప్పించే ప్రయత్నంలో మట్టిలో కూరుకుపోయింది. లోడుతో ఉన్న లారీ బయటకు రావడానికి అవకాశం లేకపోవడంతో మరో వాహనాన్ని తీసుకొచ్చి సిమెంట్‌ను అన్‌లోడ్ చేసి లారీని బయటకు తీసేందుకు చర్యలు చేపడుతున్నారు.


పాడేరు ఘాట్‌రోడ్డులో..

కలప వాహనం బోల్తా

పాడేరు, న్యూస్‌టుడే: కలపతో మైదాన ప్రాంతానికి వెళ్తున్న లారీ పాడేరు ఘాట్‌రోడ్లో అదుపుతప్పి బోల్తాపడింది. మంగళవారం రాత్రి రాజాపురం సమీపంలోని మలుపు వద్ద అదుపుతప్పి వాహనం ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో డ్రైవర్, క్లీనర్ స్వల్పగాయాలతో బయటపడ్డారు. ఇటీవల అటవీ శాఖ అధికారులు కలప తరలింపునకు అనుమతులు మంజూరు చేయడంతో వ్యాపారులు నిత్యం పదుల సంఖ్యలో లారీలు, వ్యాన్లతో కర్రలు తరలిస్తున్నారు.

ప్రజలంతా మెచ్చేలా పాలన

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే: ప్రజలందరూ మెచ్చేలా పాలన అందించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి దొన్నుదొర అన్నారు. బుధవారం కించాయిపుట్టు పంచాయతీ పెద్దాపుట్టులో నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. తహసీల్దార్ అప్పలస్వామి, ఎంఈఓ కృష్ణమూర్తి, మండల ఇంజినీరు మురళికృష్ణ, ఈఓఆర్డీ చిన్నాన్న, సర్పంచి సుభాష్‌చంద్ర, వైస్ ఎంపీపీ సత్యనారాయణ, తెదేపా మండల అధ్యక్షులు బలరామ్ పాల్గొన్నారు.

కూనవరం, న్యూస్‌టుడే: స్థానిక కూటమి నాయకులు, అధికార యంత్రాంగం సమన్వయంతో ప్రజా సమస్యలు పరిష్కరిస్తామని ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి అన్నారు. పెద్దార్కూర్, అభిచర్ల గ్రామాల్లో బుధవారం నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం గ్రామసభల్లో ఎమ్మెల్యే మాట్లాడారు. తెదేపా నియోజకవర్గ పరిశీలకులు చెల్లబోయిన శ్రీనివాసరావు, నేతలు బరపాటి ప్రకాశరావు, అప్పారావు, భాస్కర్, పాయం వెంకయ్య, రామారావు, మండల అధికారులు పాల్గొన్నారు.

డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తోందని తెదేపా మండల అధ్యక్షుడు తుడుము సుబ్బారావు అన్నారు. సొవ్వా పంచాయతీ మాలివలసలో యూనిట్ ఇన్‌ఛార్జి కమలాకర్ ఆధ్వర్యంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం బుధవారం జరిగింది. వెంకటరాజు, స్వామి, చంటి, దామోదర్, బొందు పాల్గొన్నారు.

ఎటపాక, న్యూస్‌టుడే: గౌరిదేవిపేట, పిచ్చుకలపాడు, విస్సాపురం పంచాయతీల్లో ఇది మంచి ప్రభుత్వం గ్రామ సభల్లోా. వైస్ ఎంపీపీ దొంతు మంగేశ్వరరావు పాల్గొన్నారు.


ముంచంగిపుట్టులో ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న దొన్నుదొర తదితరులు

లక్ష్మీపురం పంచాయతీ పట్టుచీర గ్రామంలో తెదేపా మండల అధ్యక్షులు పుట్టి రమేష్‌బాబు, ఎస్టీ సెల్ మండల అధ్యక్షులు కనితి మధుల ఆధ్వర్యంలో స్టిక్కర్లను ఇంటింటికీ పంచారు. సర్పంచులు ఉలవల శివకనకరాజు, రాంబాబు, ఉప సర్పంచి మడకం నర్సింహరావు, ఏవో రాబిన్‌సుదర్శన్ పాల్గొన్నారు.

గూడెంకొత్తవీధి: కూటమి ప్రభుత్వం వంద రోజుల పాలనలో గిరిజనుల ముఖాల్లో ఆనందం చూస్తున్నామని తెదేపా మండల అధ్యక్షుడు ముక్కలి రమేష్, జనసేన అరకు పార్లమెంట్ కన్వీనర్ గొర్లె వీరవెంకట్ అన్నారు. స్థానిక రామాలయం వీధిలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎంపీటీసీ సభ్యురాలు రీమల రాజేశ్వరి, నాయకులు పసుపులేటి రామకృష్ణ, ముక్కలి మహేష్ పాల్గొన్నారు.

మారేడుమిల్లి: పుల్లంగి పంచాయతీ పరిధిలోని ఎగవలస, పీడమర్రి, గుంపెనగండి, గుంద్రాతి, పాములమామిడి, బూసిగండి తదితర గ్రామాల్లో జరిగిన కార్యక్రమంలో వీరవల్లి జార్జిబాబు, సచివాలయ సిబ్బంది గాంధీ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రక్తదాన శిబిరం

రంపచోడవరం, న్యూస్‌టుడే: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్వచ్ఛతే సేవ-2024, జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి, వైస్ ప్రిన్సిపల్ రవికుమార్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని స్థానిక ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టరు శేషారెడ్డి, ప్రిన్సిపల్ డాక్టరు డి.చిట్టిబాబు ప్రారంభించారు. ఈ శిబిరంలో విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, స్కిల్‌హబ్ స్టూడెంట్స్, అధ్యాపకులతో మొత్తం 45 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ప్రిన్సిపల్ చిట్టిబాబు మాట్లాడుతూ రకక్తధానం చేయడం వల్ల ఒకరి ప్రాణం కాపాడిన వారమవుతామన్నారు. ఏరియా ఆసుపత్రి వైద్యులు హారిక, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.


రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఆసుపత్రి సూపరింటెండెంటు శేషారెడ్డి, ప్రిన్సిపల్ చిట్టిబాబు

ఏళ్లు గడుస్తున్నా సదుపాయాలు కరవు

రంపచోడవరం, న్యూస్‌టుడే: బ్రాహ్మణీయ హిందుత్వ పాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 24 నుంచి 30వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా కులనిర్మూలన అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ జిల్లా కార్యదర్శి కుంజా దూలయ్య పేర్కొన్నారు. మహాత్మా జ్యోతిబా పూలే స్థాపించిన సత్యశోధక్ సమాజ్ 152వ ఆవిర్భావ దినోత్సవాన్ని నాయకులు కత్తుల బాలురెడ్డి అధ్యక్షతన స్థానిక మార్క్స్ ఏంగిల్స్ భవనంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా దూలయ్య మాట్లాడుతూ ఏజెన్సీలో తినడానికి తిండి, ఉండటానికి ఇల్లు లేక గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. డివిజన్ కార్యదర్శి పల్లాల లచ్చిరెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 77ఏళ్లు దాటుతున్నా విద్య, వైద్యం, ఉపాధి రంగాల్లో దళితులు, గిరిజనులు వెనుకబడి ఉన్నారన్నారు. పీవోడబ్ల్యూ జిల్లా కార్యదర్శి పి.అనసూయ, ప్రతినిధులు మడకం జోగమ్మ, చిలకమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్య, ఆరోగ్యంపై శ్రద్ధ: పీవో


మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో సింహాచలం

రంపచోడవరం, న్యూస్‌టుడే: ఏజెన్సీలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతోపాటు ఆరోగ్య విషయంలో తగు జాగ్రత్తలను తీసుకోవాలని ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో బుధవారం అన్ని మండలాల ఏటీడబ్ల్యూవోలు, గురుకులాలు, ఏకలవ్య రెసిడెన్షియల్ పాఠశాలల ప్రిన్సిపల్స్, ఆశ్రమ పాఠశాలల హెచ్‌ఎంలతో ఐటీడీఏ పీవో డీడీ కొండలరావుతో కలిసి సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా పీవో సింహచలం మాట్లాడుతూ కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా విద్యను అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్దేశించిన మెనూను సక్రమంగా అమలు చేయాలని లేకుంటే శాఖాపరమైన చర్యలు తీసుకుంటానన్నారు. ప్రతి నెలలో మూడో శనివారం పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఏటీడబ్ల్యూవోలు రామతులసి, కృష్ణమోహన్, డీడీ కార్యాలయ పర్యవేక్షకులు కిషోర్ హెచ్‌ఎంలు, డీడీ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఈపీడీసీఎల్ పునర్ వ్యవస్థీకరణ

ఈనాడు, అనకాపల్లి: జిల్లాల విభజన జరిగిన రెండేళ్ల తర్వాత తూర్పు ప్రాంత విద్యుత్తు పంపిణీ సంస్థ (ఈపీడీసీఎల్)ను పునర్ వ్యవస్థీకరించారు. విశాఖ కేంద్రంగా ఉన్న ఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయం పరిధిలో ఇప్పటి వరకు అయిదు ఉమ్మడి జిల్లాల్లో ఒక్కో సర్కిల్ కార్యాలయాలున్నాయి. తాజాగా ప్రతీ జిల్లాకు ఒక సర్కిల్ ఉండేలా మరో ఆరు కార్యాలయాలను కొత్తగా ఏర్పాటు చేశారు. అనకాపల్లి, పాడేరు, పార్వతీపురం మన్యం, అమలాపురం, కాకినాడ, భీమవరం కేంద్రాలుగా ఇవి పనిచేయనున్నాయి. ఈ మేరకు ఒక్కో సర్కిల్‌కు 43 నుంచి 56 మంది వరకు అధికారులు, సిబ్బందిని సర్దుబాటు చేశారు. ప్రస్తుత బదిలీల్లోనే కొత్త జిల్లాలకు సూపరింటెండెంట్ ఇంజినీర్ (ఎస్ఈ) పోస్టులను కూడా భర్తీచేశారు. ఇటీవల కార్యనిర్వాహక ఇంజినీరు (ఈఈ) పోస్టు నుంచి పదోన్నతులు పొందిన గొప్పు ప్రసాద్, జీఎన్ ప్రసాద్‌లను అనకాపల్లి, అల్లూరి జిల్లాలకు ఎస్ఈలుగా నియమించారు. అదే విధంగా కార్పొరేట్ కార్యాలయ పరిధిలో 80 మంది డీఈఈలు, 30 మంది ఈఈలకు స్థానచలనం కల్పించారు. కొత్త జిల్లాల్లో పరిపాలన, పర్యవేక్షణ సంబంధిత సమస్యలు లేకుండా ఉంటాయనే ఉద్దేశంతో నూతన సర్కిళ్లను ఏర్పాటు చేసినట్లు సీఎండీ పృథ్వీతేజ్ తెలిపారు.

గిరిజన సంక్షేమశాఖ డీడీగా కొండలరావు



రంపచోడవరం, న్యూస్‌టుడే: రంపచోడవరం గిరిజన సంక్షేమ శాఖ ఉపసంచాలకుడి(డీడీ)గా ఐ.కొండలరావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన ఇప్పటివరకు పాడేరులో డీడీగా పనిచేసి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశ్రమ, జీపీఎస్ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన జరిగేటట్టు చర్యలు చేపడతానన్నారు. డీడీ కార్యాలయ సూపరింటెండెంటు కిషోర్, ఉద్యోగులు డీడీని మర్యాదపూర్వకంగా కలిశారు.

వెలుగు ఏపీడీగా డేగలయ్య



రంపచోడవరం, న్యూస్‌టుడే: రంపచోడవరం వెలుగు ఏపీడీగా ఎస్.డేగలయ్య బుధవారం బాధ్యతలు చేపట్టారు. కర్నూలు ఏపీడీగా పనిచేస్తూ ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇప్పటివరకు రంపచోడవరం ఏపీడీగా పనిచేసిన శ్రీనివాసరావు రాజమహేంద్రవరం డీఆర్‌డీఏకు డీపీఎంగా బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఏపీడీ డేగలయ్య మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో స్వయం సహాయక సంఘాలకు చెందిన మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తానన్నారు. డీపీఎం, ఏపీఎంలు, సీసీలు, సిబ్బంది ఏపీడీని మర్యాదపూర్వకంగా కలిశారు.

జి.మాడుగుల ఎస్సైగా షణ్ముఖరావు



జి.మాడుగుల, న్యూస్‌టుడే: జి.మాడుగుల ఎస్సైగా షణ్ముఖరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకు ముందుకు ఇక్కడ పనిచేసిన ఎస్సై శ్రీనివాసరావు అనకాపల్లి జిల్లా బుచ్చెయ్యపేటకు బదిలీ అయ్యారు. కురుపాం నుంచి షణ్ముఖరావు ఇక్కడకు వచ్చారు. శాంతి భద్రతల పరిరక్షణకు తన వంతు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

అన్న సమారాధన

వై. రామవరం, న్యూస్‌టుడే: వై. రామవరం కూడలిలోని రామాలయం వద్ద అన్న సమారాధన నిర్వహించారు. వినాయక ఉత్సవాలు సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు.

దసరా ఉత్సవాలకు ముహూర్తపు రాట

సీలేరు, న్యూస్‌టుడే: సీలేరులో దసరా ఉత్సవాలకు బుధవారం ముహూర్తపు రాట వేశారు. గత 33 సంవత్సరాలుగా ఇక్కడ ఏటా ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. భవానీ మాలధారులు, ముత్తయిదువుల సమక్షంలో, వేదపండితుల మంత్రోచ్చారణ నడుమ ఈ కార్యక్రమం జరిగింది. వచ్చే నెల 3 నుంచి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు కమిటీ ప్రతినిధులు టకిరి బుట్టి, పి.కృష్ణ తెలిపారు.


ముహూర్తపు రాటలో భక్తులు

గోడ నిర్మాణంతో అవస్థలు

గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే: జాతీయ రహదారి నిర్మాణంతో నివాసాలు, దుకాణాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని పెదవలసకు చెందిన ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. పెదవలసలో బుధవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ పనులకు తాము వ్యతిరేకం కాదని, గ్రామంలో ఇరువైపులా ఎత్తయిన గోడలు నిర్మించడం వల్ల కొండవాలు ప్రాంతం నుంచి వచ్చే వర్షపు నీటితో గృహాలు, దుకాణాలు ముంపునకు గురయ్యే అవకాశం ఉందన్నారు. రాకపోకలు వీలు లేకుండా పోయిందని చెప్పారు. కనీసం మంచి నీరు తెచ్చుకోవడానికి ఇక్కట్లు పడుతున్నామని పేర్కొన్నారు.

★ జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా పెదవలసలో రహదారికి ఇరువైపులా పన్నెండు అడుగుల సిమెంటు గోడ కట్టడంపై స్థానిక గిరిజనులు అవస్థలకు గురవుతున్నారు. దీనిపై స్థానికులు ఇటీవల కలెక్టర్‌కు సమస్యను విన్నవించారు.


పెదవలసలో ఇంటికి ఆనుకుని నిర్మించిన గోడ

పోటీ పరీక్షలతో విజ్ఞానం పెంపు

వరరామచంద్రాపురం, న్యూస్‌టుడే: పాఠశాల స్థాయి నుంచి పోటీ పరీక్షలు రాయడం వల్ల విద్యార్థుల్లో విజ్ఞానం పెరుగుతుందని ప్రధానోపాధ్యాయులు బాబూరావు తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ఏపీ జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి ప్రతిభ పరీక్ష నిర్వహించారు. 75 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి వచ్చే నెల ఒకటిన మండల, తరువాత జిల్లా స్థాయి పరీక్ష ఉంటుందన్నారు.

గంగవరం, న్యూస్‌టుడే: జనవిజ్ఞాన వేదిక చెకుముకి ప్రతిభ పరీక్ష పోటీలను బుధవారం నిర్వహించినట్లు యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి కోసు కృష్ణ తెలిపారు. గంగవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, గంగవరం, కొత్తాడ ఆశ్రమ బాలురు ఉన్నత పాఠశాలలు, కొత్తాడ కస్తూర్బా విద్యాలయల్లో 150 మంది విద్యార్థులకు ఈ పరీక్ష నిర్వహించారు. యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి సీహెచ్ వెంకటేశ్వర్లు, అధ్యక్షుడు రాంబాబు దొర, మహిళా అధ్యక్షురాలు రుక్మిణిదేవి, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


గంగవరంలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

కూనవరం, న్యూస్‌టుడే: మండలంలోని పలు పాఠశాలల్లో నిర్వహించిన చెకుముకి ప్రతిభ పరీక్షకు 279 మంది విద్యార్థులు హాజరయ్యారని యూటీఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు అనిగి నాగేశ్వరరావు, కన్నారావు తెలిపారు. విద్యార్థులు ఎక్కువగా ఇలాంటి పరీక్షల్లో పాల్గొంటే, వారిలో విజ్ఞానం పెరుగుతుందన్నారు.

గ్రామాల్లో వైద్య శిబిరాలు

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: చట్లవాడ పంచాయతీ పరిధి బోదులూరులో బుధవారం ఉచిత దంత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. బొమ్మూరులోని ది లైఫ్ చర్చి వ్యవస్థాపకుడు బాబ్ రెజి విక్టర్స్ జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో సుమారు 350 మంది దంత సమస్యలకు వైద్య సేవలను పొందారు. దూడ ప్రమోద్, దూడ సుందర్‌పాల్, గొర్లె ప్రదీప్, నవకాంత్ పాల్గొన్నారు.

గంగవరం, న్యూస్‌టుడే: మొల్లేరులో బుధవారం పశు గర్భకోశ వ్యాధుల వైద్య శిబిరం నిర్వహించారు. గర్భందాల్చిన ప్రతి ఆవు, గేదెను వైద్యాధికారి సాయంతో చూడి పోకుండా కాపాడుకోవచ్చన్నారు. పశు సంవర్ధక శాఖ రంపచోడవరం ఇన్‌ఛార్జి ఏడీ ఎస్.సూర్యనారాయణమూర్తి, మొల్లేరు సర్పంచి కుంజం లక్ష్మి, మండల పశు వైద్యాధికారి రిక్కిరాయ్ తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

పాడేరు 89853 66570,
అరకులోయ 63034 86346,
రంపచోడవరం 94908 77172

చింతపల్లి, న్యూస్‌టుడే

?: లంబసింగి పంచాయతీ చెక్కరాయిబంద గ్రామానికి సరైన రహదారి లేదు. రాకపోకలకు అనేక ఇబ్బందులు పడుతున్నాం.

– రాజ్‌కుమార్, చెక్కరాయిబంద

✔: ఉపాధి హామీ పథకంలో చెక్కరాయిబంద గ్రామానికి రహదారి నిర్మించేలా ప్రతిపాదనలు సిద్ధం చేశాం. నిధులు విడుదలైతే పనులు చేపడతాం.

– బాలకిషోర్ పీఆర్ జేఈ చింతపల్లి

రంపచోడవరం, న్యూస్‌టుడే

?: స్థానిక యశోదమ్మ వీధి నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వెళ్లే రహదారి మధ్యలో డ్రైనేజీపై మూత శిథిలమైంది. వాహనదారులు నిత్యం ప్రమాదాలకు గురవుతున్నారు.

– సూరిబాబు, యశోదమ్మవీధి, రంపచోడవరం

✔: డ్రైనేజీపై మూతను వేసి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటాం.

– రమేష్, పంచాయతీ కార్యదర్శి, రంపచోడవరం

వేతన బకాయిలు చెల్లించాలని ధర్నా

చింతూరు, న్యూస్‌టుడే: వెలుగులో పనిచేస్తున్న వీఓఏల పెండింగ్ వేతనాలు చెల్లించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం వెలుగు వీఓఏలు చింతూరు బస్టాండ్ నుంచి ఐటీడీఏ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి, ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెండింగ్‌లో వేతనాలు చెల్లించటంతోపాటు ఉద్యోగ భద్రత కల్పించాలని, మూడేళ్ల కాల పరిమితి సర్క్యులర్‌ను రద్దు చేయాలని, రూ. 10 లక్షల బీమా సౌకర్యం కల్పించాలని తదితర డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని నాలుగు మండలాల ప్రత్యేక అధికారి అంబేడ్కర్‌కు అందజేశారు. సీఐటీయూ నాయకులు, వీఓఏలు పాల్గొన్నారు.


ప్రత్యేకాధికారికి వినతిపత్రం అందజేస్తున్న వీఓఏలు

క్రమశిక్షణతో ఉన్నత స్థానాలకు..

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: గిరి విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలని అన్నవరం ఎస్సై రాజారావు అన్నారు. బుధవారం లోతుగెడ్డ బాలుర ఆశ్రమ పాఠశాల విద్యార్థులతో సమావేశమయ్యారు. కమశిక్షణతో చదువుకుంటే ఉన్నత శిఖరాలకు చేరుకుంటారన్నారు. ఎస్సై రమణ, అన్నవరం పోలీసులు పాల్గొన్నారు.

కూనవరం, న్యూస్‌టుడే: విద్యార్థుల దృష్టి చదువుపైనే ఉండాలని, అప్పుడే లక్ష్యాలు చేరుకోగలరని ఎటపాక సీఐ కన్నపరాజు వివరించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం నిర్వహించిన గంజాయి నిర్మూలన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గంజాయి, మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలన్నారు. ఎస్సై శ్రీనివాస్, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రంపచోడవరం, న్యూస్‌టుడే: యువత అధికంగా మత్తు పదాలకు బానిసలవుతున్నారని, దీంతో జీవితాలు నాశనం చేసుకుంటున్నారని ఎస్సై మోహన్‌కుమార్ పేర్కొన్నారు. ఎస్పీ అమిత్‌బర్దార్, ఏఎస్పీ జగదీష్ అడహళ్లి ఆదేశాలపై సీఐ రవికుమార్ ఆధ్వర్యంలో స్థానిక లెనోరా ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం 'గంజాయి నిర్మూలన'పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్సై మోహన్‌కుమార్ పాల్గొన్నారు.

రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: యువకులు చెడు అలవాట్లు, మత్తు పదార్థాలకు బానిసై బంగారు భవిష్యత్తును పాడుచేసుకోవద్దని సీఐ ఎన్.సన్యాసినాయుడు అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎస్సై ఇ.నరసింహమూర్తితో కలిసి గంజాయి నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. సీఐ, ఎస్సైలు మాట్లాడుతూ ర్యాగింగ్ జోలికి పోరాదన్నారు. మైనర్లు వాహనాలు నడపరాదని, ద్విచక్ర వాహనంపై ముగ్గురు ఎక్కినా, అతివేగంగా వాహనాలు నడిపినా చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ అప్పన్నబాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.


రాజవొమ్మంగిలో మాట్లాడుతున్న సీఐ సన్యాసినాయుడు, పక్కన ఎస్సై నరసింహమూర్తి

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: విద్యార్థులంతా అలవాట్లకు దూరంగా ఉండాలని, సమాజ హితమైన కార్యక్రమాల్లో పాలు పంచుకోవాలని గుర్తేడు ఎస్సై సాయికుమార్ సూచించారు మారేడుమిల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అలవాట్లకు దూరంగా ఉంటామని, ర్యాగింగుకు పాల్పడమని, ప్రభుత్వ నిబంధనలను పాటిస్తామంటూ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కళాశాల ప్రిన్సిపల్ కర్నారావు, అధ్యాపకులు పాల్గొన్నారు.